క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: అదుపు తప్పి బైక్ బోల్తా పడిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. కెరమెరి మండలం కెలికే గ్రామానికి చెందిన యువకుడు తిరుపతి బైక్‌పై ఆసిఫాబాద్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో అడ గ్రామ సమీపంలో అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న అనక దేవేందర్

జైనూర్: నిరుపేదలకు చలి నుంచి ఉపశమనం కలిగించేందుకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు అనక దేవేందర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అనక దేవేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని సుంగాపూర్, కొండ పటార్ గ్రామాల్లో నిరుపేదలకు ఫౌండేషన్ తరఫున దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న జుగ్నక దేవురావు

జైనూర్: జనవరి 11వ తేదీన నిర్వహించే ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ దంపతుల వర్ధంతిని విజయవంతం చేయాలని హైమన్‌డార్ఫ్ కమిటీ గౌరవ అధ్యక్షుడు జుగ్నక దేవురావు అన్నారు. ఆదివారం మండలంలోని మార్లవాయిలో హైమన్‌డార్ఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కనక వెంకటేశ్, ఆత్రం మానిక్, జుగ్నక ధర్మేందర్, అధ్యక్షుడిగా మడావి మధు, ఉపాధ్యక్షుడి ఆత్రం రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శులుగా మండాడి లింగు, కొడప సుదర్శన్, ఆడ ప్రవీణ్, కోశాధికారులుగా కనక జుగాదిరావు, ఆత్రం భగవంత్‌రావు, ప్రచార కార్యదర్శులుగా కొడప రాజు, ఆడ సోనేరావు, కనక భుజంగ్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఖైరీ గ్రామస్తులు

కెరమెరి: మండలంలోని ఖైరీ గ్రామంలో అగ్నికి దగ్ధమైన ఇళ్ల బాధితులకు ఆదివారం అదే గ్రామానికి చెందిన గ్రూప్‌వన్ సభ్యులు విరాళాలు సేకరించి రూ. 97,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. మాలి సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు రూ.11000 అందజేశారు. కార్యక్రమంలో ఖైరీ గ్రామానికి చెందిన లేండుగురే చందు, రఘురాం, కొమురయ్య, కొండయ్య, నాందేవ్, లస్మయ్య, సుభాశ్, శివరాం, సత్తయ్య, శ్రీరాం, నారాయణ, తిరుపతి, వెంకటేశ్, అశోక్, మాలీ సంఘం మండలాధ్యక్షుడు కావ్‌డే తుల్సిరాం, పటేళ్ల సంఘం అధ్యక్షుడు సెండే నారాయణ, కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఎస్సై ఎస్.మధుకర్ బాధితురాలికి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మోర్లె సకారాం భార్య స్రవంతికి రూ. 5వేల నగదుతో పాటు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

ఎక్స్‌ఆర్మీ అసోసియేషన్ త్రైమాసిక సమావేశం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ త్రైమాసిక సమావేశం ఆదివారం పట్టణంలోని శిశుమందిర్ హైస్కూల్‌లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.శివకుమార్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును కలిసి సమస్యలు విన్నవించినట్లు తెలిపారు. అసోషియేషన్‌కు మూడు గుంటల భూమి, అమరవీరుల స్తూపం కోసం స్థలం కేటాయించాలని కోరగా.. సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పాపయ్య, ప్రధాన కార్యదర్శి సునీల్ మండల్, ఆర్గనైజింగ్ సెక్రెటరి వినాయక చాప్లె, జాయింట్ సెక్రెటరి రమకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

చర్చీలు ముస్తాబు..!

జిల్లాలోని చర్చీలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. చర్చీలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. చర్చీల ఆవరణలో గుడిసెలు, మేరీ మాత, జీసస్ చిత్రాలు, ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేశారు. క్రీస్తు జన్మ దినోత్సవం పురస్కరించుకొని క్రైస్తవులు ఇళ్ల వద్ద క్రిస్మస్ క్రిబ్‌లు తయారు చేశారు.



ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ న్యూ లైఫ్ చర్చి



కౌటాల: విజయనగరం క్యాథలిక్ చర్చి



కౌటాల: విద్యుత్ దీపాలతో ముస్తాబైన సీజీఎంఎం చర్చి



కాగజ్‌నగర్‌టౌన్: యూసీసీ చర్చి, ఎస్పీఎం



సిర్పూర్(టి): విద్యుత్తు దీపాలతో అలంకరించిన కల్వరి చర్చి



కాగజ్‌నగర్‌టౌన్: సీఎస్ఐ చర్చి

చలి మంటలు..!



భీమన్‌గొందిలో చలిమంటలు కాగుతున్న ప్రజలు

కెరమెరి: జిల్లాను చలి వణికిస్తోంది. దీంతో ప్రజలు రాత్రి, పగలుతో సంబంధం లేకుండా మంటలు కాగుతున్నారు. ఉదయం 10 గంటల తర్వాత కూడా చలి తీవ్రత ఉండడంతో జిల్లావాసులు ఇబ్బందులు పడుతున్నారు.

నేడు మధునపోచమ్మ బోనాలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని జాలరివాడలో సోమవారం మధునపోచమ్మ ఆలయం వద్ద బోనాల కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివారం జాలర్లు గ్రామ దేవతలైన పోచమ్మతల్లి, పోతరాజు, శ్రీకృష్ణుడు ప్రతిమలతో నదీ స్నానానికి బయలుదేరారు. పుణ్యస్నానం చేయించి నదిలోనే నూతన వస్త్రాలు అలంకరించారు. డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. వారం రోజులుగా కొనసాగుతున్న పోచమ్మ వారోత్సవాలు సోమవారం బోనాలతో ముగియనున్నాయి.

'సింగరేణి మనుగడ ఐఎన్‌టీయూసీతోనే సాధ్యం'

రెబ్బెన: సింగరేణి సంస్థ మనుగడ ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని సంఘం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీతో పాటు పలు డిపార్టుమెంట్లకు చెందిన కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరగా వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి అనేక హక్కులు సాధిస్తామని పేర్కొన్నారు. కార్మికుల సొంతింటి పథకంతో పాటు గృహ నిర్మాణానికి వడ్డీ లేని రుణాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు సంగెం ప్రకాశ్ రావు, మాజీ కోఆర్డినేటర్ చంద్రకుమార్, మాసాడి నారాయణ, శ్రీనివాస్, సూర్యనారాయణ, భాస్కర్, అనంత్‌కుమార్, ప్రవీణ్, అబ్బాస్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్

శ్రీలక్ష్మీనారాయణ స్వామికి పట్టువస్త్రాలు సమర్పణ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పోటెత్తారు. మాజీ శాసన సభ్యురాలు పాల్వాయి రాజ్యలక్ష్మి కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సుప్రభాత సేవ, స్వామి వారికి పూజాహారతి, స్వామి వారి ఎదుర్కోలు, శ్రీ లక్ష్మీ నారాయణుల కల్యాణం, ద్వాదశి భోజన ప్రసాద వితరణ, స్వామి వారికి 108 రకాల ప్రత్యేక ప్రసాదాల నివేదన, పల్లకిపై స్వామి వారి ఊరేగింపు, ఊయల సేవ, శ్రీ చక్ర స్నానం, పవళింపు సేవ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.



పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళ్తున్న రాజ్యలక్ష్మి

భక్తిశ్రద్ధలతో పల్లకి ఊరేగింపు

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయం 50వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను ఆదివారం ప్రత్యేక పూజలతో ఆలయ ప్రధాన అర్చకుడు అంబేద శంకరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం శివుని ఆరాధన, హారతి, గ్రామ దేవతలకు ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలతో శివాలయం నుంచి పార్వతి పరమేశ్వరుల పల్లకి ఊరేగింపు కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వరకు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు అంబేద సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయ ఆవరణలో భక్తుల సందడి



దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: షష్టి బోనాలు పురస్కరించుకొని మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయంలోని శివలింగంతో పాటు నందీశ్వరుడు, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హర్యాన గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే 'పాల్వాయి'



దత్తాత్రేయతో హరీశ్‌బాబు

బెజ్జూర్: హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయను సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గవర్నర్‌ను కలిసిన వారిలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సాయి దీక్షాపరుల పూజలు

ఆసిఫాబాద్‌రూరల్: సాయిబాబా మాలధారణ స్వీకరించిన దీక్షాపరులు ఆదివారం మొక్కులు చెల్లించారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు మధుకర్ శర్మ ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నవగ్రహ, గణపతి, శ్రీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడిని దునిలో వేశారు.

ఆది దేవతలకు పూజలు

- నేటి నుంచి కొలాం గ్రామాల్లో షష్టిపూజలు
- పోతురాజు, ధర్మరాజులకు మొక్కులు

కెరమెరి: కొలాం ఆదివాసీలు మండలంలోని ఇందాపూర్ గ్రామ సమీపంలో గల పోతురాజు ఆలయంలో కొలువైన పోతురాజు, ధర్మరాజు దేవతలకు ఈనెలలో షష్టి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నెల 17న ఆలయంలో దీపాలంకారం చేశారు. అక్కడే రాత్రింబవళ్లు కటోడాలు బస చేసి పూజలు నిర్వహించారు. కాగా ఆదివారం ఉదయం మండలంలోని నాగల్‌గొందికి దేవతలు చేరారు. నేటి నుంచి రెండు రోజులు అక్కడే ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయా గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించనున్నారు.

ఊరూరా పూజలు..

నాగల్‌గొందిలో రెండు రోజులు ప్రత్యేక పూజలు జరిపిన తర్వాత ధనోరా, కొత్తగూడ, ముర్కిలొంక, ఆగర్‌వాడ, చిచ్‌పల్లి, ఖైరీట్ గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పోతురాజు, ధర్మరాజులను తీసుకెళ్లి పూజలు నిర్వహిస్తారు. సిడాం వంశస్తులకు ప్రసిద్ధి గాంచిన ఈ దేవతలను అన్ని గోత్రాల వారు కొలుస్తారు. వచ్చే నెలలో ఇందాపూర్‌లోని పోతురాజు ఆలయంలో వారం రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయి.

200 కిలోమీటర్ల పాదయాత్ర

ఆయా గ్రామాలు తిరిగిన తర్వాత పోతురాజు, ధర్మరాజు దేవతలు గంగా స్నానాలకు బయలుదేరుతారు. జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి సమీపంలో హస్తినపురంలోని గోదావరిలో స్నానం చేయించి తిరుగు పయనమవుతారు. కెరమెరి నుంచి హస్తినాపురం వరకు సుమారు 200 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేస్తారు.



ఆది దేవతలకు మొక్కుతున్న మహిళలు

అంతా శుభం జరగాలని..



అంతా శుభం జరగాలని పోతురాజు, ధర్మరాజులను మొక్కుకుంటాం. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు తమ గ్రామాలకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

- సిడాం రాజు, పోతురాజు, ధర్మరాజు ఆలయ పూజారి

కూలీల కొరత..!

- చేనులోనే ఎండిపోతున్న పత్తి
- పత్తితీతకు తీవ్ర ఇక్కట్లు
- ఆందోళనలో రైతులు

కెరమెరి: జిల్లాలో పత్తిసాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన అన్నదాత ఇప్పుడు పత్తి తీసేందుకు కూలీలు దొరక్క తిప్పలు పడుతున్నారు. దీంతో రోజుల తరబడి పగిలిన పత్తి పంట పొలంలోనే ఉండిపోతుంది. మండలంలో మొత్తం 6400 మంది రైతులుండగా ఈ ఏడాది 24వేల ఎకరాల్లో పత్తి పంటను సాగ చేస్తున్నారు. అందులో అంతర పంటగా 6000 ఎకరాల్లో కంది, 1000 ఎకరాల్లో పెసర, 300ఎకరాల్లో మినుములు, 700 ఎకరాల్లో జొన్న, 60 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. పూర్తిగా వ్యవసాయాధారిత మండలమైన కెరమెరిలో 95 శాతం రైతులే ఉన్నారు. అత్యధిక రైతులు బీటీ విత్తనాలను వేశారు. మండలంలో అన్నదాతలు దాదాపు ఒకేసారి విత్తనాలు నాటడం వల్ల పత్తి పంట కూడా ఒకేసారి చేతికొచ్చింది. దీంతో పత్తి తీసేందుకు కూలీలు లభించక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రస్తుతం ఎటు చూసినా పొలాలన్నీ పగిలిన పత్తితో తెల్లగా కనిపిస్తున్నాయి. పక్షం రోజుల క్రితం కురిసిన వర్షానికి పత్తి పంట రంగు మారింది. దిగుబడి చాలా వరకు తగ్గింది.

కూలీలకు పెరిగిన డిమాండ్

వారం రోజుల క్రితం వరకు పత్తి తీసే కూలీలకు కిలో రూ. 8 చెల్లిస్తుండగా ప్రస్తుతం కూలీల కరువుతో కిలోకు రూ. 10 చెల్లిస్తున్నారు. అయినా కూలీలు దొరకడం లేదు. కూలీలు దొరక్కపోవడంతో అన్నదాత పెందలాడే కూలీల ఇంటి ముందు వాలుతున్నారు. తలుపు తట్టి లేపి మరీ బేరమాడుతున్నారు. కూలీలు దొరకడం లేదని అనేక మంది రైతులు కుటుంభ సభ్యులతో రోజుల తరబడి పత్తి ఏరుతున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పత్తి పంట చేతికొచ్చే సమయంలో రైతులు పడుతున్న కష్టాలు అంతా ఇంతా కావు. మండలంలోని కొన్ని ప్రాంతాలకు చెందిన రైతులు మహారాష్ట్ర నుంచి పత్తి ఏరేందుకు కూలీలను తీసుకొచ్చారు. పొలంలో పత్తి ఏరడం పూర్తయ్యే వరకు కూలీలకు కావాల్సిన అన్ని వసతులను రైతులే సమకూర్చుతున్నారు. పత్తి తీయడం ముగిశాక లెక్కలు చూసి సొంత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఒక్క ఏరివేతకే..

ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా పత్తి పంట దిగుబడి తగ్గిపోయింది. వర్షాభావ పరిస్థితులు, తుఫాను ప్రభావంతో పత్తి పంటలో కాయలు కాయలేదు. కాసిన కాయలు కూడా ఒకేసారి పగలడంతో ఒక్క ఏరివేతకే చేనులో పత్తి ఖాళీ అవుతుంది. దీంతో పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి. అనేక ప్రాంతాల్లో కాయలు లేక ఖాళీ మొక్కలే దర్శనమిస్తున్నాయి.



చేనులోనే పత్తి

దిగుబడి తగ్గింది..



ఈసారి వానల వల్ల పత్తి పంట రంగు మారింది. పంట దిగుబడి కూడా చాలా తగ్గింది. మార్కెట్‌లో ధర లేకపోవడం, దిగుబడి తగ్గడంతో ఈ ఏడాది చాలా నష్టపోవాల్సి వస్తుంది. ఉన్న పత్తిని ఏరదామంటే కూలీలు దొరకడం లేదు.

- మడావి రఘునాథ్, రైతు, మెట్టపిప్రి

సమస్యలు పరిష్కరించాలని వినతి

బెల్లంపల్లి: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. రైల్వే రడగంబాల బస్తీలో ఉన్న ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సమస్యలు తీర్చాలని వినతిపత్రం అందజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. భవన నిర్మాణ కార్మికులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వినోద్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

పునరావాస కాలనీ సందర్శన

కాసిపేట: మండలంలోని ఓసీ నిర్వాసిత గ్రామం దుబ్బగూడం ప్రజలకు కేటాయించిన పునరావాస స్థలాన్ని ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యం పునరావాస స్థలాన్ని అప్పగించిన వెంటనే అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. యాజమాన్యంతో పాటు ప్రభుత్వంతో మాట్లాడి వెంటనే పనులు పూర్తయ్యేలా చూస్తానని ఆర్‌అండ్ ఆర్ కాలనీలో పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు రత్నం ప్రదీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జీపీ లెవల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువకుల్లో క్రీడానైపుణ్యాలు ఉన్నాయని, వాటిని వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. సర్పంచ్ ఆదే శ్రీనివాస్, ఉప సర్పంచ్ దుర్గం వెంకటేశ్, నాయకులు దోని రవి, శ్రీకాంత్, ధమ్మపాల్, నిర్వాహకులు నరేశ్, వెంకటేశ్, శేఖర్, లోహిత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.